పోల్చుకొని హిందీ ఫిలుములను పొగిడేవాడు, హాలీవుడ్ ఫిలుములు చూచినవాడికి రెటమతస్థుడుగా కనబడతాడు.

ఈ రెటమత సిద్ధాంతం జాగ్రత్తగా పరిశీలించవలసిన సిద్ధాంతం. ఇది తెలియనివాళ్లు ప్రచారం చేస్తున్నంత, పైకి కనబడేంత పిచ్చిసిద్ధాంతం కాదు. దీనిభావం తెలుసుకోవటం మీాదే, దీని హృదయాన్ని అర్థం చేసుకోవటంమీాదే, సంఘాభివృద్ధి ఆధారపడి ఉంది.

## అహం

ఒక కవి ఒక సభలో ఈ విధంగా ఉపన్యసిస్తున్నాడు—

“మీరు కనిపెట్టారో లేదోగాని నేను తిక్కన కంటే గొప్ప వాణ్ణి. నా కవిత్వంలో తిక్కన కవిత్వంలో వున్న గుణాలకంటే గొప్ప గుణాలున్నవి. ఇంతవరకు భారత దేశంలో పుట్టినవాళ్ళలో తిక్కన కంటే గొప్ప కవిని నే నే....”

ఒక సభికుడు చివాలున లేచి—“తిక్కన కంటే మీరు గొప్ప కవులనుకోటానికి దృష్టాంతరం ఏమిటి?”

“దృష్టాంతరమా?....దృష్టాంతరమా,” అని నట్లు కొట్టటం మొదలుపెట్టాడు కవి.

ఇంకొక సభికుడు లేచి ఈ విధంగా జవాబు చెప్పాడు—“దృష్టాంతరాలకేం! కావలసినన్ని వున్నాయ్. తిక్కనా కవిత్వం రాశాడు; వీరూ కవిత్వం రాశారు. తిక్కనా పుట్టాడు; వీరూ పుట్టారు. వీటినిబట్టి తిక్కనకూ వీరికీ చాలా పోలిక లున్నవని విశదం అవుతూవుంది. ఇక తిక్కనకంటే ఈయన గొప్పవా డెలాగంటారా? తిక్కన చచ్చాడు; ఈయన చావలేదు....” అని కూర్చున్నాడు.

కవి తెల్లమొహం వేశాడు.